జీవో 46 బాధితులతో సర్కారు బంతాట

- బీఆర్ఎస్ నేత రాకేశ్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం జీవో 46 బాధితులతో బంతాట ఆడుతున్నదని, అమాయక యువతను మోసగిస్తున్నదని బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి ఒక ప్రకటనలో మండిపడ్డారు. ఏడాదికాలంగా తమ హక్కుల కోసం కొట్లాడుతున్న జీవో 46 బాధితుల కేసు బుధవారం హైకోర్టులో విచారణకు రాగా, ప్రభుత్వం తరపు న్యాయవాది, అడ్వకేట్ జనరల్‌తో కావాలని కృత్రిమ కారణాలు చెప్పి వాయిదాకు కారణమైందని ఆరోపించారు. 20 సార్లకుపైగా కోర్టులో వాదనలు వాయిదా పడ్డాయని చెప్పారు. నోటికొచ్చిన హామీలిచ్చి అధికారంలోకి రాగానే సీఎం రేవంత్‌రెడ్డి కూడా దాటవేత ధోరణి అవలంబిస్తున్నారని మండిపడ్డారు. తాత్కాలికంగా తప్పించుకోవడానికి ప్రభుత్వ యంత్రాంగాన్ని వాడుకొని విచారణ వాయిదా పడాలని చూస్తున్నారని, చివరికి కాంగ్రెస్ ప్రభుత్వం చేసేది తప్పంటూ కోర్టు తీర్పు వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా జీవో 46 బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జీవో 46 బాధితులకు న్యాయం జరిగే వరకూ బీఆర్ఎస్ తరపున కొట్లాడుతామని స్పష్టంచేశారు. చట్టసభలు స్పందించకపోతే.. కోర్టులో కొట్లాడుతాం, కోర్టులో సమాధానం దొరకకపోతే, ప్రజాకోర్టులో కొట్లాడుతామని చెప్పారు. జీవో 46పై ప్రభుత్వ వైఖరి చెప్పకపోతే ప్రజాఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

రేపు తెలంగాణ మట్టిబిడ్డ పీవీ జయంతి

హైదరాబాద్, జూన్26 (నమస్తే తెలంగాణ): తెలంగాణ మట్టిబిడ్డ, మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు జయంతి వేడుకలను రేపు (శుక్రవారం) ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. పీవీ మార్గ్‌లోని పీవీ జ్ఞానభూమిలో వేడుకలు కొనసాగనున్నాయి. ఉదయం 9గంటలకు పుష్పాంజలి, ప్రార్థనలు, భజనలు, సర్వమతప్రార్థనలు, అదేవిధంగా పీవీ కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో వైద్య, రక్తదాన శిబిరాలు, ఛాయాచిత్ర ప్రదర్శన, అన్నదాన కార్యక్రమాలు కొనసాగనున్నాయి.

కేసీఆర్ నివాసానికి ప్రజల తాకిడి

మొదటిపేజీ తరువాయి...

అభిమానిని ఆప్యాయంగా పలకరిస్తూ వారికి ప్రత్యేక సమయం కేటాస్తున్నారు. కేసీఆర్ వారి యోగక్షేమాలను తెలుసుకుంటున్నారు. అభిమానుల తాకిడితో కేసీఆర్ నివాసం బుధవారం కిక్కిరిసిపోయింది. వచ్చిన వారందరినీ ఒక్కొక్కరిగా కేసీఆర్ వద్దకు పంపించేందుకు పోలీసులు శ్రమించాల్సి వచ్చింది. ఈ సందర్భంగా జై తెలంగాణ.. జై కేసీఆర్ అనే నినాదాలతో ప్రాంతం మార్మోగింది.

కార్యకర్తలతో తరలివచ్చిన నేతలు

పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు, ఇతర ముఖ్యనేతలు కార్యకర్తలతో పాటు వచ్చి అధినేత కేసీఆర్‌తో సమావేశమవుతున్నారు. వారి నుంచి కేసీఆర్ నియోజకవర్గాల్లో పరిస్థితులను అడిగి తెలుసుకుంటున్నారు. బుధవారం కూడా పలు నియోజకవర్గాల నుంచి వందల సంఖ్యలో కార్యకర్తలతో నాయకులు తరలివచ్చారు. కేసీఆర్‌ను కలిసినవారిలో ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్, బండారి లక్ష్మారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, చామకూర మల్లారెడ్డి, సుధీర్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, పార్టీ ముఖ్యనేతలు రాగిడి లక్ష్మారెడ్డి, సుధీర్‌బాబు, కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవిగౌడ్, గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ రజనీసాయిచంద్, ఆయా జిల్లాల స్థానిక నాయకులు ఉన్నారు.

తనను కలిసేందుకు వచ్చిన వారితో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. చిత్రంలో ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, సునీతా లక్ష్మారెడ్డి

పొన్నం పలాయనం!

- ఫ్లైయాష్ స్కామ్‌లో సవాల్ స్వీకరించని మంత్రి
- జూబ్లీహిల్స్ వేంకటేశ్వరస్వామి గుడికి కౌశిక్‌రెడ్డి
- పావుగంట ఎదురుచూసిన ఎమ్మెల్యే
- మంత్రి గుడికి రాకపోవడంతో స్కామ్ రుజువైంది
- బ్లాక్‌బుక్‌లో తొలిపేరు పొన్నందే
- అధికారంలోకొచ్చాక వెలికితీస్తాం
- మీడియాతో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

ఫిలింనగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద మీడియాతో మాట్లాడుతున్న హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

హైదరాబాద్, జూన్ 26 (నమస్తే తెలంగాణ)/జూబ్లీహిల్స్: ఫ్లైయాష్ రవాణా స్కామ్‌లో తన నిజాయితీని నిరూపించుకొనే విషయంలో రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఎందుకు పారిపోతున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నిలదీశారు. నీతివంతుడిని అని చెప్పుకొనే పొన్నం ఫ్లైయాష్ రవాణాలో అవినీతికి పాల్పడలేదని జూబ్లీహిల్స్ వేంకటేశ్వరస్వామి సాక్షిగా ప్రమాణం చేయడానికి ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. 'పొన్నం చేసిన సవాల్‌ను స్వీకరించి వీణవంకలోని నా నివాసంలో ఆంజనేయస్వామి చిత్రపటంతో ప్రమాణం చేసి నా నిజాయితీని నిరూపించుకున్న' అని చెప్పారు. బుధవారం ఉదయం జూబ్లీహిల్స్ వేంకటేశ్వరస్వామిని దర్శించుకొన్న కౌశిక్‌రెడ్డి.. దేవాలయం బయట మీడియాతో మాట్లాడారు. ఫ్లైయాష్ రవాణాలో పొన్నం రూ.100 కోట్ల స్కామ్ చేశారని ఆరోపించానని, ఆయన అవినీతికి పాల్పడకపోతే వేంకటేశ్వరస్వామికి పరమభక్తుడైన పొన్నం శ్రీవారి సమక్షంలో ప్రమాణం చేయాలని ఆదివారం సవాల్ విసిరానని గుర్తుచేశారు. చెప్పిన మాట ప్రకారం తాను బుధవారం ఉదయం 11 గంటలకు వేంకటేశ్వరస్వామి సన్నిధికి వచ్చానని, మంత్రి పొన్నం కోసం పావుగంటపాటు ఎదురుచూశానని చెప్పారు. కానీ, ఆయన రాలేదని పేర్కొన్నారు. ఆయన వచ్చి ప్రమాణం చేస్తే వెంటనే తాను బహిరంగ క్షమాపణలు చెప్పేందుకు సిద్ధమని తెలిపారు. పొన్నం ఆలయానికి రానందున ఫ్లైయాష్‌లో రూ.100 కోట్ల స్కామ్ చేశాడని రుజువైందని చెప్పారు. తాను కేవలం ఆరోపణలు చేయడం లేదని, స్కామ్‌కు సంబంధించిన పూర్తి ఆధారాలు ఉన్నాయని తెలిపారు. ఫ్లైయాష్ వేయింగ్ బిల్లులను ఈ సందర్భంగా ఆయన మీడియాకు చూపించారు. అధికలోడుతో ఫ్లైయాష్ రవాణా చేయడం వల్ల రోడ్లు దెబ్బతింటున్నాయని, ఫలితంగా ప్రమాదాల బారినపడి పలువురు చనిపోతున్నారని మండిపడ్డారు. ప్రజల శవాలపై పైసలు ఏరుకోవడానికి సిగ్గనిపించడం లేదా? అని పొన్నంను ఉద్దేశించి ఆగ్రహం వ్యక్తం చేశారు.

బ్లాక్‌బుక్‌లో మొదటిపేరు పొన్నం..

ఐదేండ్లలో తిరిగి బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని, కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని కౌశిక్‌రెడ్డి ధీమా వ్యక్తంచేశారు. ఇప్పుడు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు చేసే అవినీతిపై బ్లాక్ బుక్ ఓపెన్ చేస్తున్నామని చెప్పారు. వేంకటేశ్వర దేవాలయం సాక్షిగా బ్లాక్‌బుక్‌లో మొదటి పేరు మంత్రి పొన్నం ప్రభాకర్ పేరు రాస్తున్నామని తెలిపారు. తాము అధికారంలోకి రాగానే పొన్నం చేసిన రూ.100 కోట్ల స్కామ్‌ను బయటపెడతామని చెప్పారు. ఈ సమావేశంలో యూసుఫ్‌గూడ కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్, మైనార్టీ నేత సొహైల్, పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తాం

మొదటిపేజీ తరువాయి...

హైకోర్టు పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. విచారణను జూలై 15కు వాయిదా వేస్తున్నట్టు జస్టిస్ సూరేపల్లి నందా పేర్కొన్నారు. హుజురాబాద్‌లోని లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేయకుండా నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఉన్న తనను అడ్డుకుంటున్నారంటూ కౌశిక్‌రెడ్డి హైకోర్టులో వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఒత్తిళ్ల కారణంగా అధికారులు తనను అడ్డుకున్నారని, చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొననీయడం లేదని తెలిపారు. లబ్ధిదారులకు రాజకీయాలతో సంబంధం లేకుండా వెంటనే చెక్కుల పంపిణీకి ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు.

చపాతీ రోలర్‌పై పిటిషన్ వాపస్

హైదరాబాద్, జూన్ 26 (నమస్తే తెలంగాణ): ప్రజాప్రాతినిధ్య చట్టం - 1951లో నిర్దేశించిన నిబంధనలకు విరుద్ధంగా ఎన్నికల్లో తమకు ఫలానా గుర్తునే కేటాయించాలని అభ్యర్థులు కోరుకునే అవకాశం చట్టంలో లేదని రాష్ట్ర ఎన్నికల సంఘం హైకోర్టుకు తెలియజేసింది. దీంతో చపాతీ రోలర్ గుర్తును చిహ్నాల జాబితాలో చేర్చాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను పిటిషనర్ ఉపసంహరించుకున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరగనుండటంతో ఎన్నికల గుర్తుల జాబితాలో 'చపాతీ రోలర్'ను చేర్చాలంటూ అలయన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫామ్స్ పార్టీ పిటిషన్ వేసింది. దీనిని బుధవారం చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ డివిజన్ బెంచ్ విచారించింది.

రాణాలో బీఆర్ఎస్ నేత ఆత్మహత్యాయత్నం

- ఎన్నికల నుంచీ అధికార పార్టీ నేతల వరుస దాడులు
- కాంగ్రెస్ నాయకుల దౌర్జన్యాలకు పోలీసుల వత్తాసు
- ఫిర్యాదు చేస్తే తనపైనే కేసు నమోదు చేశారని ఆవేదన
- పోలీస్‌స్టేషన్‌లోనే పురుగుల మందు తాగి..సెల్ఫీ వీడియో విడుదల

దామరచర్ల, జూన్ 26: న్యాయం చేయాల్సిన పోలీసులే కాంగ్రెస్ నాయకులను కాపాడేందుకు తనను వేధిస్తున్నారని బీఆర్ఎస్ నాయకుడు పోలీస్‌స్టేషన్ ఆవరణలోనే ఆత్మహత్యాయత్నం చేశాడు. తనకు ప్రాణహాని ఉందని, ఎస్పీ రక్షించాలని వేడుకున్నాడు. నల్లగొండ జిల్లా వాడపల్లి పోలీస్‌స్టేషన్‌లో జరిగిన ఈ ఘటనకు ముందు బాధితుడు సెల్ఫీ వీడియోలో తన ఆవేదనను వినిపించాడు. దామరచర్ల మండలంలోని గణేశ్‌పాడు గ్రామ మాజీ సర్పంచ్ రమావత్ జ్యోతి భర్త సైదానాయక్ బీఆర్ఎస్ పార్టీ నాయకుడు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రత్యర్థులు మారణాయుధాలతో దాడులు చేయడంతో ఆస్పత్రిపాలైనట్టు సైదానాయక్ వీడియోలో పేర్కొన్నారు. పార్లమెంట్ పోలింగ్ రోజున డీసీసీ ప్రెసిడెంట్ శంకర్‌నాయక్ పోలింగ్ బూత్ దగ్గర తనను కొట్టాడని వాపోయాడు. తనపై దాడి చేసిన నిందితులను అరెస్ట్ చేయాలని మే 13న వాడపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు సైదానాయక్ తెలిపారు. నెల రోజులు గడిచినా ఎఫ్ఐఆర్ కాపీ ఇవ్వలేదని, న్యాయం కోసం పలుమార్లు పోలీస్‌స్టేషన్‌కు తిరిగినా ఎస్ఐ కనీస విచారణ చేయలేదని చెప్పాడు. పైగా తనమీదే కేసు నమోదు చేశారని, పోలీసుల నుంచి ప్రాణహాని ఉందని.. ఎస్పీ రక్షించాలని వేడుకున్నాడు. ఈ క్రమంలోనే వాడపల్లి స్టేషన్‌కు చేరుకుని వెంట తీసుకెళ్లిన పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు గమనించి చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ఏరియా దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. సైదానాయక్‌ను డీసీఎంఎస్ మాజీ వైస్‌చైర్మన్ డీ నారాయణరెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ వీరకోటిరెడ్డి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి డీ వెంకటేశ్వర్లు, గిరిజన నాయకులు ఆంగోతు హాతీరాంనాయక్, ప్రకాశ్‌నాయక్, సచిన్‌నాయక్, పాచ్యానాయక్, చిట్టిబాబునాయక్ పరామర్శించారు. ఈ ఘటనపై వాడపల్లి ఎస్ఐ ఇరుగు రవిని వివరణ కోరగా.. సైదానాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒక ఘటనకు సంబంధించి కేసు నమోదు చేశామని, మరొక కేసును కోర్టు దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. అనుమతి వచ్చిన వెంటనే కేసు నమోదు చేయనున్నట్టు చెప్పారు.

డీఎస్సీ కార్యాలయం ఎదుట ధర్నా

పోలీస్‌స్టేషన్ ఎదుట ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన రమావత్ సైదానాయక్‌కు న్యాయం చేయాలని బీఆర్ఎస్ పార్టీ, సేవాలాల్ సంఘం ఆధ్వర్యంలో మిర్యాలగూడ డీఎస్పీ కార్యాలయం ఎదుట బుధవారం రాత్రి ధర్నా నిర్వహించారు. పోలీసులు అధికార పార్టీకి వత్తాసు పలుకుతూ పక్షపాత వైఖరి అవలంబిస్తున్నారని నాయకులు మండిపడ్డారు. డీఎస్పీ రాజశేఖర్‌రాజు సైదానాయక్ సతీమణి జ్యోతితోపాటు ఇతర నాయకులను పిలిచి ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతామని హామీని ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

వికారాబాద్‌లో జడ్పీ భవన ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కాలె యాదయ్యతో వాదనకు దిగిన ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి. చిత్రంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్, అధికారులు

ఎమ్మెల్యే వర్సెస్ ఎమ్మెల్సీ

- కాలె యాదయ్య, పట్నం మహేందర్‌రెడ్డి మధ్య వాగ్వాదం
- నిర్మాణం పూర్తి కాకుండానే జడ్పీ భవన ప్రారంభోత్సవంపై రగడ

వికారాబాద్, జూన్ 26 (నమస్తే తెలంగాణ): జిల్లా పరిషత్ నూతన భవన నిర్మాణం పూర్తికాకుండానే హడావిడిగా ప్రారంభోత్సవం చేయడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రశ్నించడంతో అధికార, విపక్ష ప్రజాప్రతినిధుల మధ్య మాటల యుద్ధం జరిగింది. వికారాబాద్ జిల్లా కేంద్రంలో జడ్పీ భవన నిర్మాణం ఇంకా పూర్తికాకుండానే జడ్పీ చైర్‌పర్సన్‌తో కలిసి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రారంభించారు. అనంతరం స్పీకర్ మాట్లాడుతూ.. జడ్పీ భవన నిర్మాణానికి బీఆర్ఎస్ సర్కార్ రూ.10 కోట్లు ఇస్తున్నట్టు ప్రకటించి కేవలం కాగితం మాత్రమే ఇచ్చిందని, మూడుసార్లు ఎమ్మెల్యేగా ఉన్న కాలె యాదయ్య ఏ ఒక్కరోజు మాట్లాడలేదని దుయ్యబట్టారు. డబ్బులు ఇవ్వకపోయినా జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి చొరవతో కొంతమేర నిర్మాణం పూర్తి చేశారని, అసంపూర్తిగా ఉన్న జడ్పీ భవన నిర్మాణ పనులను సీఎం ఆశీస్సులతో పూర్తి చేసే బాధ్యత తనదేనని స్పష్టంచేశారు. వెంటనే చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య స్పందిస్తూ ఏదో కాగితం అంటుండ్రు, ఆ కాగితం చూపిస్తే బాగుంటుందని అన్నారు. 'కాంట్రాక్టులు మీవే, నిధులు మీకే వస్తాయి. పూర్తి చేయాల్సింది మీరే'నని గట్టిగా బదులిచ్చారు. ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతుండగా ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి ఏం మాట్లాడుతున్నావ్ అంటూ అడ్డుకునే ప్రయత్నం చేశారు.'ఏంది మేం మాట్లాడొద్దా?' అంటూ యాదయ్య ఎదురు ప్రశ్నించారు. దీంతో ఇద్దరి మధ్య మాటల యుద్ధం జరుగుతుండగా స్పీకర్ ప్రసాద్‌కుమార్ కలుగజేసుకొని గొడవ సద్దుమణిగేలా చేశారు. కేవలం జడ్పీ చైర్‌పర్సన్ కార్యాలయం, సీఈవో కార్యాలయ భవన నిర్మాణాలనే పూర్తిచేసి ప్రారంభోత్సవం చేయడం గమనార్హం. జడ్పీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టిన తరువాత కూడా భవనాన్ని ప్రారంభించడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్‌కు చెందిన జడ్పీటీసీ సభ్యులు జడ్పీ భవన ప్రారంభోత్సవాన్ని బాయ్‌కాట్ చేశారు.

నీటిని పొదుపుగా వాడాలి

- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ చిన్నారెడ్డి

హైదరాబాద్, జూన్26 (నమస్తే తెలంగాణ): నీటిని పొదుపుగా వాడుతూ ఎక్కువ విస్తీర్ణంలో పంటలు పండించాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ చిన్నారెడ్డి సూచించారు. భూ యాజమాన్య శిక్షణ, పరిశోధన సంస్థను ఆయన బుధవారం సందర్శించారు. నీటి, భూ యాజమాన్య పద్ధతులు, భూ సాంద్రత పెంచేందుకు సంస్థ చేస్తున్న పరిశోధనలపై అధికారులతో చర్చించారు. అన్ని అంశాలపై అధ్యయనం చేసిన అనంతరం సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించనున్నట్టు చిన్నారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ విశ్రాంత అధికారులు బొమ్మిరెడ్డి కృపాకర్‌రెడ్డి, డాక్టర్ విష్ణు, వాలంతరి అధికారులు పాల్గొన్నారు.

క్యాతుర్ లిఫ్ట్-2కు రూ.1.91కోట్లు

హైదరాబాద్, జూన్26 (నమస్తే తెలంగాణ): జోగులాంబ గద్వాల్ జిల్లా అలంపూర్ మండలం శ్రీశైలం రిజర్వాయర్ బ్యాక్‌వాటర్‌పై ఏర్పాటు చేస్తున్న క్యాతూర్ లిఫ్ట్-2కు ప్రభుత్వం రూ.1.91కోట్లను మంజూరు చేసింది. బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. లిఫ్ట్ నిర్మాణం, ప్రారంభానికి రాష్ట్ర ప్రణాళిక నిధుల్లో నుంచి ఏజెన్సీకి చెల్లించేందుకు ఆమోదం తెలిపింది.

పాలన వదిలి ఢిల్లీలో ప్రదక్షిణలు

- గాడితప్పిన 7 నెలల కాంగ్రెస్ పాలన
- 200 రోజుల్లో 28 వేల కోట్ల అప్పు
- రోడ్లమీదికి నిరుద్యోగులు, ఉద్యోగులు సహా అన్నివర్గాల ప్రజలు
- 8 సీట్లిస్తే బొగ్గుబ్లాక్‌కు బీజేపీ వేలం
- హామీల అమలుపై ఒత్తిడితెస్తాం
- బీఆర్ఎస్ నేత దేవీప్రసాద్

హైదరాబాద్, జూన్ 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో 7 నెలలుగా పాలన పూర్తిగా గాడితప్పిందని బీఆర్ఎస్ నేత, బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలో చేరికలపై ఉన్న శ్రద్ధ పాలనపై లేదని మండిపడ్డారు. ఉద్యోగులు, నిరుద్యోగులు, వృద్ధులు, మహిళలు ఇలా అన్నివర్గాలు ప్రజలు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేస్తుంటే పరిష్కరించాల్సిన సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఒక కొత్త పథకం, ఒక కొత్త ప్రాజెక్టును చేపట్టకున్నా 200 రోజుల్లో రూ.28 వేల కోట్ల అప్పు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం తెలంగాణభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెడ్లలా తీసుకెళ్తే.. నేటి కాంగ్రెస్ పాలనలో ఒక్క వర్గం కూడా సంతృప్తికరంగా లేదని తెలిపారు. ఉద్యోగాల కోసం నిరుద్యోగులు, హామీల అమలు కోసం జూడాలు, అంగన్‌వాడీ టీచర్లు, పింఛన్ల కోసం వృద్ధులు, మహిళలు రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేస్తున్నారని వెల్లడించారు. చివరికి చేరికలపైనా కాంగ్రెస్ నేతలే ఆందోళన చేసే పరిస్థితి వచ్చిందని ఎద్దేవా చేశారు. రుణమాఫీ, రైతుబంధు విధివిధానాల రూపకల్పనపై ఎందుకు జాప్యం జరుగుతున్నదని ప్రభుత్వాన్ని నిలదీశారు. కాంగ్రెస్ నేతలకు ఢిల్లీ యాత్రలపై ఉన్న శ్రద్ధ రైతులకు భరోసా ఇవ్వటంపై లేదని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రుణమాఫీ, రైతుబంధుపై రివ్యూ చేశారా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో బీజేపీకి 8 ఎంపీ సీట్లు కట్టబెడితే సింగరేణి బొగ్గుబ్లాకును అమ్మేందుకు ఆ పార్టీ సిద్ధమైందని విమర్శించారు. తెలంగాణ జీవనాడి అయిన సింగరేణి ప్రైవేటీకరణకు కాంగ్రెస్, బీజేపీ కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థల నిర్వీర్యానికి రెండు పార్టీలు కంకణం కట్టుకున్నాయని, ఆ పార్టీలకు ప్రజల చేతిలో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. అధికారులు ప్రొటోకాల్ పాటించటం లేదని, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నచోట కల్యాణలక్ష్మి చెక్కులను వారితో పంపిణీ చేయించటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అల్వాల్‌లోని పంచశీల కాలనీలోని ఎమ్మెల్యే సత్యంను పరామర్శిస్తున్న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిండెంట్ కేటీఆర్

ఎమ్మెల్యే సత్యంకు కేటీఆర్ పరామర్శ

- ఎమ్మెల్యే సతీమణి రూపాదేవి చిత్రపటానికి నివాళులు
- కుటుంబసభ్యులకు ఓదార్పు

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 26 (నమస్తే తెలంగాణ)/ మల్కాజిగిరి : చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం పరామర్శించారు. అల్వాల్‌లోని పంచశీల కాలనీలో నివసిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఇంటికి వచ్చిన కేటీఆర్.. ఎమ్మెల్యే సతీమణి రూపాదేవి చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యేతో పాటు కుమారుడు యోజిత్(11), కుమార్తె రుషికశ్రీని ఓదార్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్లకు సర్కారు ధోకా

- అటకెక్కిన ఆటో రెన్యువల్ హామీ
- 1,654 మందిపై వేటు
- పాతవారి తొలగింపునకు సిద్ధం
- కొత్తగా నియామకానికి ప్రతిపాదనలు రెడీ
- ఇది అన్యాయమంటున్న గెస్ట్ లెక్చరర్లు

హైదరాబాద్, జూన్ 25 (నమస్తే తెలంగాణ): 'ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీల్లో పనిచేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీలకు నెలకు రూ.42 వేలు, యూనివర్సిటీల్లో పనిచేస్తున్న పార్ట్ టైమ్ లెక్చరర్లకు రూ.50 వేల గౌరవ వేతనాన్ని సవరించి అందజేస్తాం. ఏటా ఆటో రెన్యువల్ చేస్తాం' ఇది కాంగ్రెస్ ప్రకటించిన అభయహస్తం మ్యానిఫెస్టోలో గెస్ట్ లెక్చరర్లకు ఇచ్చిన హామీ. కానీ అధికారంలోకి వచ్చి 6 మాసాలు గడిచినా ఆ హామీని విస్మరించి గెస్ట్ లెక్చరర్లను కాంగ్రెస్ సర్కారు మోసం చేసింది. ఇంటర్ విద్యలో గతంలో పనిచేసిన 1,654 మంది గెస్ట్ ఫ్యాకల్టీపై వేటు వేయబోతున్నది. ఒకే ఒక్క కలం పోటుతో గెస్ట్ ఫ్యాకల్టీ విధానాన్నే తొలగించి ఔట్ సోర్సింగ్ విధానంలోకి మార్చనున్నది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు ఇంటర్ విద్య కమిషరేట్ నుంచి ప్రభుత్వానికి చేరాయి. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం పరిశీలనలో ఈ ప్రతిపాదనలు ఉన్నాయి. ఇందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపితే, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల రాజ్యం ఇంటర్ విద్యలో ప్రవేశించనున్నది. ఒక నియామకానికో పర్సంటేజీ, ఉద్యోగానికో రేటు చొప్పున అడ్డగోలుగా ఉద్యోగాలను అమ్ముకునే రోజులు మళ్లీ రానున్నాయి. ప్రస్తుతం పాతవారిని కొనసాగించకుండా, ఔట్‌సోర్సింగ్ విధానంలో గెస్ట్ లెక్చరర్లను తీసుకోవాలన్న ప్రతిపాదనలను గెస్ట్ లెక్చరర్ల సంఘాల నేతలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దీనిని ప్రభుత్వం విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత లేకుండా, చాలీచాలని పారితోషికంతో కాలం వెళ్లదీస్తున్న తమను రోడ్డునపడేయడం సరికాదని గెస్ట్ లెక్చరర్ల సంఘం నేత భాస్కర్ ఆవేదన వ్యక్తంచేశారు.

డిగ్రీ గెస్ట్ లెక్చరర్ల ఆందోళన

ప్రభుత్వ డిగ్రీ కాలేజీ గెస్ట్ లెక్చరర్లు మంగళశారం ఆందోళన బాటపట్టారు. తమను ఆటో రెన్యువల్ చేయాలని, పారితోషికాన్ని పెంచాలని డిమాండ్ చేస్తూ మంగళవారం హైదరాబాద్ నాంపల్లిలోని కాలేజీయేట్ కమిషనరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గెస్ట్ లెక్చరర్ల సంఘం నేతలు మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో 1,342 మంది లెక్చరర్లుగా పనిచేస్తున్నామని, తమను ఆటో రెన్యువల్ చేయాలని కోరారు. ఒక్కో సెమిస్టర్‌కు 90 రోజులు పూర్తికాగానే తమను తొలగిస్తున్నారని, ఆ తర్వాత మళ్లీ నెల, రెండు నెలలకు మళ్లీ కొనసాగిస్తున్నారని, దీంతో తాము నష్టపోతున్నామని తెలిపారు. ఇంటర్వ్యూల నిబంధనను తొలగిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చి నేడు విస్మరించిందని ధ్వజమెత్తారు. తమకు నెలకు ఇస్తున్న రూ.28 వేల పారితోషికాన్ని రూ.42 వేలకు పెంచుతామన్న కాంగ్రెస్ హామీని నెరవేర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఆందోళనలో డిగ్రీ కాలేజీ గెస్ట్ లెక్చరర్ల అసోసియేషన్ అధ్యక్షుడు కొర్ర ఈశ్వర్‌లాల్ నాయక్, బగ్గునాయక్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు కాంగ్రెస్ హ్యాండ్!

- గ్రూప్-1మ